# దారి తప్పిన ఈగలు

**మందరపు వెంకటేశ్వరరావు**

కోమటి కోటయ్యగారి మిఠాయి కొట్టు ఆ ఊళ్లో చాలా పేరు పడింది. లడ్డులు, మైసూర్ పాక్‌లు, జాంగ్రీలు, బాదుషాలు మొదలైన నాగరిక పదార్థాలు, బెల్లపుమిఠాయి ఉండలు, జీడిపప్పు, గవ్వలు, పేలాల ఉండలు మొదలైన నాటుదినుసులు-ఒకటేమిటి ఆ కొట్లో దొరకని తీపి వస్తువే లేదు!

ఆ కొట్టును ఆశ్రయించుకొని, తరతరాలుగా ఒక ఈగ కుటుంబం తామరతంపరగా వృద్ధి పొందుతూ వచ్చింది. ఇప్పటితరంలో పెద్ద ఈగయొక్క తాత, కోటయ్య తండ్రి కాలంనుంచీ ఆ కొట్టునే ఆశ్రయించుకొని అక్కడి తీపిపదార్థాల మీద-స్వేచ్ఛగా వాలుతూ కడుపు నిండుగా మిఠాయి ఆరగిస్తూ, హాయిగా కాలక్షేపం చేస్తున్నది. మిఠాయిదినుసులు పెట్టే అద్దాల బీరువా అడుగు అరక్రింద మనిషి. కంటి కగపడకుండా ఇన్నేళ్ళు గుట్టుగా కాలం వెళ్ళబుచ్చుతూ, ఆ ఊళ్ళోని ఈగకుటుంబాలలో కెల్లా గొప్పవారనే పేరుకూడా సంపాదించుకున్నాయి. మురుగు కాల్వల్నీ, పేడకుప్పల్నీ, రొచ్చు గుంటల్నీ, చేపలకొట్లుల్నీ ఆశ్రయించుకున్న ఈగకుటుంబాల వాళ్ళు, కసాయి దుకాణాలలో కాపురం ఉంటున్న ఈగజాతివాళ్ళు, మిఠాయి ఈగ కుటుంబంవారంటే ఎంతో గౌరవంగా చూస్తుండేవారు.

మిఠాయివారి యింట చిన్న ఆడ ఈగ పుట్టింది. ఆ ఈగపిల్ల పుట్టిన రోజు పండగకి ఆ ఊళ్ళో ఉన్న ఈగలకన్నింటికీ విందుజరిగింది. ఆరోజున కోటయ్య మిఠాయికొట్టుమీద పడి, ఈగలన్నీ కొల్లగొట్టాయి రకరకాల మిఠాయిల రుచిచూసిన ఈగలు లొట్టలువేసుకొంటూ, మిఠాయికుటుంబం వారిఅదృష్టాన్ని పొగడుతూ, తమ ఇళ్ళకు వెళ్ళిపోయాయి.

ఈ విందులో పాల్గొనడానికి వచ్చిన కసాయివారికుటుంబం కూడ ఆ ఊళ్ళో చాలాకాలంగా స్థిరనివాసం ఏర్పరచుకొన్న ఈగల కుటుంబాలలో ఒకటి. ఈ కుటుంబంలోని ఈగలలోనే పెద్దపెద్ద వస్తాదులు పుట్టి మక్షికలోకంలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకొన్నాయి. నూర్‌ఖాన్ సాయిబు మాంసం కొట్టును చిరకాలం ఆశ్రయించుకొని ఉండడంచేత ఈ కుటుంబం వారికి కసాయివారనే పేరు సార్థకమైపోయింది. మిఠాయివారి విందులో పాల్గొనడానికి కసాయివారి ఈగలన్నీ వచ్చాయి. ఆనాటినుంచీ కసాయివారికీ, మిఠాయివారికీ స్నేహం కలిసి ఎక్కడైనా తారసిల్లినప్పుడు 'ఓహో!' అంటే 'ఓహో!' అనుకొంటూ ఒకర్ని ఒకరు పలకరించుకొనేవారు.

'కసాయివారి మగ ఈగపిల్లకూ, పుట్టినరోజు పండగ చేసుకొన్న మిఠాయివారి ఆడ ఈగపిల్లకూ, ఆ రోజునుంచీ జతకలిసి ఆడుకొంటూండేవి. అప్పుడప్పుడు కసాయివారి ఈగ అబ్బాయి మిఠాయివారి ఈగ అమ్మాయి యింటికి వెళ్ళినప్పుడు మిఠాయివారి అమ్మాయి కొత్త కొత్త మిఠాయి దినుసుల్లోంచి తొండంతో చిన్న చిన్న పలుకులు పెకలించుకువచ్చి ఫలహారంపెట్టి గౌరవిస్తుండేది.

క్రమక్రమంగా ఈ రెండు పిల్ల ఈగలు పెద్దవి అయ్యాయి. మిఠాయివారు తమ ఈగ అమ్మాయికి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ కసాయివారి అబ్బాయితో కలిగిన చనువు, స్నేహంగా మారి ప్రేమగా బలపడిపోయింది. అందుచేత పెద్దలు చూస్తున్న సంబంధాలు, చేస్తున్న ప్రయత్నాలు ఆ ఈగ అమ్మాయికి నచ్చలేదు. ఆ పక్కఊళ్ళోని 'కాఫీ అండ్ భోజనహోటలు'లో కాపురం ఉంటూన్న 'హోటలు'వారని పేరుపడిన ఈగ కుటుంబం పెద్దలు వచ్చి ఈ ఈగ అమ్మాయిని చూసుకొని



ఎంతదాహం

ఫోటో: జి. వి. రామమూర్తి—మచూరం.

వెళ్ళారు. వీరికీ వారికీ సంబంధాలు వచ్చాయి. ఈ ఈగ అమ్మాయి ఉండబట్టలేక తల్లి ఈగ దగ్గరకు వెళ్లి 'ఇప్పుడు నాకీపెళ్లి వద్దమ్మా' అని చెప్పింది. తల్లి ఈగ ఆశ్చర్యపోయి, 'ఇదేవిటే చిన్నీ! ఈ విడ్డూరం! మీ నాన్న రెక్కలు ముక్కలయ్యేలాగ ఊళ్ళన్నీ ఎగిరి ఎగిరి, మన హోదాకు తగిన ఎంచక్కటి సంబంధం తెస్తే పెళ్లే వద్దంటావు. నీకేమైనా మతిపోయిందా ఏమిటి?" అంది. ఈగపిల్ల ఏడుపు ఆపుకో లేక వెక్కి వెక్కి ఏడుస్తూ-"కసాయి వారి అబ్బాయినయితే చేసుకుంటాను" అని మనసులో మాట వెళ్ల గక్కి బైటికి ఎగిరి వెళ్ళిపోయింది. పిల్లమాటలకు కలిగిన ఆశ్చర్యం నుంచి కాస్సేపటికి తేరుకొని, తల్లి ఈగ తండ్రి ఈగ దగ్గరకు వెళ్లి పిల్ల ఈగ చెప్పిన సంగతి చెప్పింది. తండ్రి ఈగ కోపం పట్టలేక ఇటూ, అటూ ఎగిరి, తిరిగివచ్చి వాలి తల్లి ఈగతో ఇలా అంది-"మన హోదా ఎక్కడ? వాళ్ళ హోదా ఎక్కడ? వెధవ మాంసపు ముక్కలు, రక్తపు గడ్డలు కొరుక్కుతినే ఆ కసాయి వాళ్లెక్కడ? మనమెక్కడ? ఈ పెళ్లి జరగడానికి వీలు లేదు."

అక్కడ కసాయివారి ఈగ అబ్బాయికి కూడా వాళ్ళ ఈగపెద్దలు అదే సమయంలోనే పెళ్ళి తలపెట్టారు. ఆ ఈగ అబ్బాయి తల్లిదండ్రులతో తాను మిఠాయివారి అమ్మాయిని తప్ప ఇంకెవ్వర్నీ పెళ్లాడనని ఖచ్చితంగా చెప్పాడు. కసాయి ఈగ పెద్దలు ఈగ అబ్బాయికి పరిపరి విధాల నచ్చచెప్పారు-"నాయనా, వియ్యానికీ, కయ్యానికీ సమఉజ్జీ ఉండాలి. మనలో మిఠాయివారు గొప్పవారని పేరుపడ్డారు. నిత్యం మిఠాయి తప్ప మరొకటి ముట్టుకోరు. వాళ్ళ తాతతండ్రులదగ్గ

## ★ దారితప్పిన ఈగలు ★

క్కించి అలాగే జరుపుకుంటూ గర్వించి ఉన్నారు. మనమంటే వాళ్ళకు మొదటినించీ లోకువే. పాటిజాతివాళ్ళమని గౌరవిస్తున్నట్టు కనిపిస్తారే గాని నిజానికి మనల్ని లోలోపల తక్కువ చూపు చూస్తూనే ఉన్నారు. ఆ యింటి పిల్లను తెచ్చుకొని మనం నిగ్రహించుకోలేం నాయనా, పెద్ద బజారు చేపల మార్కెట్టువారి చిన్న అమ్మాయిని ఇస్తామంటున్నారు. 'తర్వాత నీ యిష్టం!" అని చెప్పారు.

ఇక్కడ మిఠాయివారి ఈగ అమ్మాయి, అక్కడ కసాయివారి ఈగ అబ్బాయి పట్టినపట్టు విడవకపోవడంవల్ల పెద్ద ఈగలకెంత యిష్టంలేకపోయినా ఆ రెండు ఈగలకూ పెళ్ళిచేయక తప్పింది కాదు.

పెళ్ళి అయిన తర్వాత మిఠాయివారి అమ్మాయి కసాయివారి యింటికి కాపరానికి వెళ్లింది. అత్తవారిల్లు అంతకు ముందెప్పుడూ చూడలేదు. అత్తఈగ నేలమీద పడిన రక్తపుముద్దలమీద వ్రాలి గడ్డకట్టిన రక్తాన్ని గోలుకుతూంది.


### రు: 5 లకు రేడియో



ఈ రేడియోవిద్యుచ్ఛక్తి,బాటరీ, లేకుండా పనిచేస్తుంది. స్టాకు పరిమితం నేడే వ్రాయండి. రు. 5. పోస్టేజి అదనం.

AMERICAN TRADING AGENCY
(Radio House) P. B. 75 (A. P. W)
AMRITSAR.


మామ ఈగ, ఇతర ఈగలు కలిసి వేలాడగట్టిన మాంసపు ముక్కల మీదకు జమ్మని ముసురుతూ, లేస్తూ కనిపించాయి. ఆ దృశ్యం చూడగానే మిఠాయివారి ఈగకు వాంతిపర్యంతం అయింది. "అయ్యబాబో...! ఈ యింట్లో నే నెలా ఉండను?" అనుకొంది. కసాయివారి ఈగ అబ్బాయి వచ్చి భార్యఈగను లోపలికి తీసుకువెళ్ళాడు. "ఏమిటీ వెధవవాసన? ఎలా ఉంటున్నారు మీరిక్కడ?" అంటూ భర్తఈగతో లోపలకు వెడుతూ అంది. "రెండు రోజులుంటే నీకే అలవాటవుతుంది లెద్దూ" అన్నాడు ఈగ అబ్బాయి.

మాంసపు ముక్కలు, రక్తపు మరకలు చూస్తేనే వాంతి చేసుకొంటున్న మిఠాయివారి ఈగమ్మాయి ప్రతిరోజు భర్తను పుట్టింటికిపంపించి మిఠాయి పలుకులు తెప్పించుకొని కాలం గడుపుతోంది. ఈ ఈగ అమ్మాయి ఆ యింట్లో శ్లేష్మంలో పడినట్టు కొట్టుకొంటూంది. అక్కడనుంచి ఎప్పుడు ఎగిరిపోవడమా అనే ఆలోచిస్తూవుంది. ఈవిడ అతిశయం చూస్తే కసాయివారికి చాలా అసహ్యంగా వుంది.

ఆరోజున మిఠాయివారి ఈగ చిన్నది నిద్రలేస్తూండగానే భర్త ఈగ వచ్చి—"ఇదుగో చూడు, ఇవ్వాళ సంతరోజు. మేమందరం చేపల మార్కెట్టుకు వెళుతున్నాం. సాయంత్రంలోగా తిరిగి రావడం పడదు. మా తమ్ముణ్ణి మీ ఇంటికి పంపి అన్నం తెప్పించుకో" అని చెప్పి వెళ్లిపోయాడు. మగ ఈగ చెప్పినప్రకారం మిఠాయివారి అమ్మాయి, కసాయివారి చిన్న ఈగపిల్లవాణ్ణి పిలిచి, పుట్టింటికివెళ్ళి మిఠాయి తెమ్మని పంపింది.

వెళ్ళిన ఈగపిల్ల ఎంతకూ తిరిగి రాలేదు. ఇక్కడ ఈవిడకు ఆకలి ముండుకుపోతోంది. ఇంకా వస్తాడు, వస్తాడు అని చూస్తూండగా వెళ్లిన ఈ కసాయివారి ఈగచిన్నవాడు మిఠాయివారి యింట్లో స్పృహ తప్పిపోయాడనే కబురు వచ్చింది. కబురు తెలియగానే ఈవిడ రివ్వున పుట్టింటికి ఎగిరివెళ్లింది. ఈ సంగతి చేపల మార్కెట్టుకు వెళ్లిన కసాయివారి కుటుంబానికి తెలిసి ఆ ఈగలన్నీ జమ్మని వచ్చి వ్రాలాయి. పాపం ఆ చిన్న ఈగ తెలివితప్పి మిఠాయిపళ్లెం దగ్గరపడి గిలగిల తన్నుకొంటున్నదల్లా కాస్సేపు అలా తన్నుకొని ప్రాణం వదిలింది. మిఠాయివారి పెద్ద ఈగ విచారంగా కసాయివారిని చూస్తూ—"ఏం చెయ్యం? చిటికెలో ఈ ఆపద విరుచుకుపడింది. నిన్న మా కోటయ్యసెట్టి కొట్టును హెల్త్ ఇనస్పెక్టరు తనిఖీ చేస్తున్నప్పుడు మేమందరం ఆ దుష్టుడికళ్ళ పడ్డాం. ఆ ఇనస్పెక్టరు మమ్మల్ని చూపిస్తూ కోటయ్యతో - "ఇలా ఈగలు ముసురుతున్న సరుకు ఇకముందు అమ్మేవంటే కేసుపెట్టి జుల్మానా వేయిస్తాను. జాగ్రత్త?" అని భయపెట్టి వెళ్ళాడు. ఇవ్వాళ మన అబ్బాయి వచ్చేసరికి మేం ఇంట్లో నక్కి ఉన్నాం. కోటయ్య ఇవ్వాళ మా పని పట్టిస్తాడని మేం ముందే గ్రహించి, పైకి రాకుండా అణిగిమణిగి కూర్చున్నాం. వచ్చిన మన అబ్బాయి తిన్నగా యింట్లోకి రాక, ఈ పళ్లెంమీద, ఆ పళ్లెంమీద

ప్రాణాలతో గంతులేస్తున్నట్టు న్నాడు. ఘుమఘుమలాడే మిఠాయి చూస్తే ఎవరికైనా నోరూరుతుం దనుకోండి. ఇంతలో కోటయ్య అల మారులోంచి "ఫ్లిట్ స్ప్రేయర్" తీసి బీరువా అంతా జల్లడం ప్రారం భించాడు. వాసన తగిలేసరికి మేం ఇంకా లోపలికిపోయి కూర్చు న్నాం. కాస్సేపటికి బైటకువచ్చి చూసేసరికి, ఇదుగో ఈ పళ్ళెం ప్రక్క గిలగిల తన్నుకొంటూ కని పించాడు. ఫ్లిట్ మీద పడి ఉంటుంది. మేం ఈ ధక్కా మొక్కీ లకు అలవాటుపడ్డవాళ్ళం కాబట్టి తప్పి జారి ఆ ఫ్లిట్ మీద పడినా తప్పించుకుపోతున్నాం" అని చెప్పి ఊరడించింది.

కసాయివారి ఈగలు వణుకుతూ, మొత్తుకొంటూ ఇంటికి తిరిగి వచ్చాయి. వాటి విచారం మిఠాయి వారి అమ్మాయిగారి కోపంగా పరిణమించింది "ఈ ఈగ మూలంచే వల్లే మా కిన్ని తిప్పలు వచ్చాయి. ఈ మహారాణీగారికి రక్తమాంసాలు సహించవు. మావాణ్ణే పెళ్ళాడే ముందే ఇవన్నీ ఆలోచించుకోలేక పోయిందా" అని సాధింపులు ఎక్కు వైనాయి.

మిఠాయివారి అమ్మాయికి దిన దిన గండంగా ఉంది. ఒకరోజున భర్త ఈగను చూసి-"ఛీ, ఇక్కడ ఉంటే నీ నూనెగిన్నెలోనో పడి చస్తాను. ఎక్కడికైనా ఎగిరిపోదాం వస్తారా రారా?" అని పోరుపెట్టింది. ఇటూ అటూ చెప్పలేని కసాయివారి ఈగ అబ్బాయి చివరకు చేసేదిలేక భార్య ఈగతో కలిసి ఎక్కడికైనా ఎగిరిపోవడానికే నిశ్చయం చేసు కొన్నాడు. ఆ మర్నాడే రెండు ఈగలూ ఇల్లు వదలి ఎగిరిపోయాయి.

కసాయికుటుంబంలోని ముసలి ఈగకు ఈసంగతి తెలిసి-"అవునులే, వీళ్లకు ప్రేమతప్ప మరేమీ కన బడడంలేదు. పరిస్థితుల్ని అర్థం చేసుకోలేని వీళ్ల కష్టమైనను ప్రేమే. అనుభవిస్తారు కానీయ్" అని గొణుక్కుంది.

ఈగ దంపతులు ఇల్లు వదిలిన తర్వాత ప్రొద్దుటనుంచి సాయంత్రం వరకు ఎగిరి, ఎగిరి, దారితప్పి, ఒక పొలంవస్తే అక్కడ ఒక చెట్టుమీద ఆగాయి. ఆడ ఈగకు ఆకలి మండుకు పోతూంది. మగ ఈగకూ ఆకలి గానే ఉంది. ఆ పొలంలో మిఠాయి ఉండ లెక్కడినుంచి వస్తాయ్? ఆ చెట్టుక్రింద పడుకొనిఉన్న ఎద్దు మూపుమీద పెద్ద పుండువుంటే దాన్ని కాకులు ముద్దుగా పొడు చుకు తింటున్నాయి. ఆ పుండును చూసేసరికి కసాయివారి అబ్బాయికి నోరూరింది. మిఠాయివారి అమ్మా యిని చూసి "నీకేమో బాగా ఆక లిగాఉంది. అయినా మిఠాయి తప్ప మరొకటి ముట్టవాయె. ఆ ఎద్దు పుండు చూస్తుంటే నా నోరూరు తూంది. కళ్లు మూసుకొని నువ్వు కూడా కాస్త అదే ఎంగిలిపడు. ఈ పొలంలో మనకేం దొరుకు తుంది" అని కసాయివారి ఈగ అబ్బాయి చెప్పాడు. కాలే కడు పుకు మండే బూడిద అన్నట్టు మిఠాయివారి ఈగ అమ్మాయి చేసేదిలేక, ప్రాణాలు కడబట్టు కుంటే, ఆ పుండుమీద వ్రాలి, ఉన్న మాంసంపలుకు పెకలించి కడుపు నింపుకొంది. మగ ఈగకు కమ్మని ఫలహారమే అది!

కడుపు నింపుకొని చెట్టుమీదకు వచ్చి వ్రాలిన ఆ ఈగ దంపతులకు అల్లంతదూరాన చెట్టుకొమ్మల మధ్య చక్కని సాలిగూడు ఒకటి కనిపించింది. సూర్యుడి సాయంకాల కిరణాలు పడి ఆ గూడు మిలమిలా మెరిసిపోతోంది. మిఠాయివారి ఈగ ఆ గూటి సౌందర్యానికి మైమరిచి- "చూడండి, అదేమిటో గాని చాలా చిత్రంగా ఉంది. ఈ రాత్రి దాని మీద నిద్రపోదాం" అని చెబు తూనే ఎగిరి సాలిగూడుమీద వ్రాలింది. వ్రాలిన ఈగ సాలి గూట్లో చిక్కుపడి, కదలలేక గిల గిల తన్నుకొంటూంది. భార్య ఆప దలో చిక్కుకున్నట్టు చూసిన మగ ఈగ లేచి రివ్వున ఎగిరివెడుతూ ఆ సాలిగూటికే తగుల్కొని తానూ చిక్కుపడిపోయింది. ఎంత గింజు కున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఇల్లు కదిలి రాకపోతే ఈ ఆపద వచ్చేది కాదుగదా' అన్నట్టు ఆడ ఈగకేసి చూసింది. ఆడ ఈగ ఏడుస్తూ ఏదో చెప్పబోతుండగా గూడుమధ్య పొంచివున్న సాలి పురుగు ఒక్క పరుగున వచ్చి ఆడ ఈగను దారంతో చుట్టబెట్టివేసింది. భార్యను రక్షిద్దామని గింజుకొం టున్న మగఈగమీదకు సాలీడు దృష్టి మరలింది. ఒక్క పరుగులో వచ్చి మగఈగనుకూడా దారంతో చుట్టబెట్టి చంపివేసింది.

ఆ ఈగదంపతుల్ని సాలీడు ఆ రాత్రి హాయిగా ఆరగించాడు. సాలీడుకు మిఠాయివారి ఈగ ఎంత కమ్మగా ఉందో, కసాయివారి ఈగ కూడా అంతే రుచిగా ఉంది!

★